# జాకీలు పెట్టినా కాంగ్రెస్ లేవదు

## తక్కువ సమయంలోనే రేవంత్ సర్కారు గ్రాఫ్ డౌన్ • పేదలకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలి

- చెట్ల నరికివేత విషయంలో సామాన్యుడికో న్యాయం... రేవంత్‌డ్డికో న్యాయమా?
- యంగ్ ఇండియా స్కూల్ ఫీజు రూ.1.5 లక్షలా?
- గజ్వేల్ బీఆర్‌ఎస్ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, వంటేరు యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్, ఏప్రిల్ 13: అన్నీ అబద్ధాలే చెప్తున్న రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని, జాకీలు పెట్టినా లేవలేని స్థితికి కాంగ్రెస్ పార్టీ చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే తమ పని అయిపోయిందని చెప్పారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ తక్కువ సమయంలోనే స్పీడ్‌గా పడిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు పెట్టినా బీఆర్‌ఎస్సే అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి దేశంలోనే మాట తప్పిన ముఖ్యమంత్రి.. రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా స్కూల్స్‌లో రూ.1.5 లక్షల ఫీజు చెల్లించాలని, కానీ, కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వమే ఒక్కో విద్యార్థిపై రూ.1.2 లక్షలు ఖర్చు పెట్టి నాణ్యమైన విద్యను అందించిందని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉచితంగా విద్యను అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేస్తున్నదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఓట్ ఫర్ నోట్, చెట్ల నరికివేత, అబద్ధాలు, బూతులు మాట్లాడటం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడంలో బ్రాండ్ అంబాసిడర్ అని హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. ఆయన బ్రాండ్‌ను ప్రజలే నిర్ణయించాలని కోరారు.

### సామాన్యుడికో న్యాయం... రేవంత్‌రెడ్డికో న్యాయమా?

సొంత పొలంలో పెంచుకున్న చెట్టును నరికితేనే జరిమానాలు వేస్తారని, అదే రేవంత్ రెడ్డి మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందలాది ఎకరాల్లో పచ్చని చెట్లను నరికించారని, ఇక్కడ సామాన్యుడికో న్యాయం, రేవంత్‌రెడ్డికో న్యాయమా? అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రామగుండంలో మూడు వేల ఎకరాల్లో, అగ్రికల్చర్ యూనివర్సిటీలో వంద ఎకరాల్లో, హెచ్‌సీయూలో 400 ఎకరాల్లో పచ్చనిచెట్లను నరికితే అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మొక్కలు పెంచితే, రేవంత్‌రెడ్డి పాలనలో వాటిని నరికేస్తున్నారని విమర్శించారు. హెచ్‌సీయూకు సంబంధించిన 400 ఎకరాలను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు బాండ్ రూపంలో తెచ్చారని, రూ.170 కోట్లు బ్రోకర్ ఫీజు చెల్లించారని దుయ్యబట్టారు. 'భూమిని తాకట్టు పెట్టింది నిజం.. అప్పు తెచ్చింది నిజం.. ఇది నిజం కాదని నిరూపిస్తారా?' అని హరీశ్‌రావు సవాల్ చేశారు. దీనిపై సూటిగా, సీదా సీదాగా దమ్ముంటే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర నాయకులు దేవీరవీందర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై విచారణ చేపట్టాలి

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం జరిగి 50 రోజులు దాటినా సహాయక చర్యల్లో పురోగతి లేకపోవడం విచారకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను కాపాడటంలో రేవంత్ సర్కారు విఫలమైందని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా కార్మికులు క్షేమంగా వస్తారని యావత్ దేశం ఎదురుచూస్తుంటే, సర్కారు మాత్రం ఇద్దరి మృతదేహాలను వెలికితీసి చేతులు దులుపుకొన్నదని దుయ్యబట్టారు. ఒక్కసారి ఘటనాస్థలికి వెళ్లొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఒక్కసారైనా సమీక్ష చేయకుండా నిర్లిప్త వైఖరిని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. 'హెలికాప్టర్‌లో వెళ్లిన మంత్రులు హడావుడి చేయడమే తప్ప సాధించిందేమీలేదు.. వారు పెట్టిన తేదీలు మారాయి తప్ప ఏ ఒక్కరినీ ప్రాణాలతో బయటకు తెచ్చిందిలేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటి కోసం, కూలి కోసం తెలంగాణకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలువాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సన్నబియ్యంలో సగం నూకలే

*పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో సగానికిపైగా నూకలే ఉన్నాయని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో పాలిష్, ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయని, వండితే అన్నం బుజబుజ అవుతున్నదని, తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలకు నూకలు లేకుండా క్వింటాల్‌కు రూ.350 చొప్పున చెల్లించి ఫైన్‌రైస్ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా రూ.350 చొప్పున మిల్లర్లకు చెల్లించి కడుపునిండా అన్నం తినేవిధంగా సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్.. నూకలు బుక్కండి అంటూ తెలంగాణ ప్రజలను హేళన చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా సన్న బియ్యం పేరుతో పేదలకు నూకలే పంపుతున్నారని మండిపడ్డారు. రెండు విడతలుగా వానకాలంలో రూ.9 వేల కోట్లు, యాసంగిలో రూ.5 వేల కోట్లు కలిపి రేవంత్ సర్కారు రూ.14 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు కానీ, రైతులకు మాత్రం రైతుబంధు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు.*

## పండుగలా ఎల్కతుర్తి సభ

- 27న సత్తుపల్లి నియోజకవర్గం సత్తాచాటుదాం
- సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర



పెనుబల్లి, ఏప్రిల్ 13: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించబోతున్నామని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెంలో ఆదివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు అధ్యక్షతన రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సండ్ర మాట్లాడుతూ.. ఈ సభకు భారీ ఎత్తున తరలివెళ్లి సత్తుపల్లి నియోజకవర్గ సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. పార్టీ రజతోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## గులాబీ దళం కదం తొక్కాలి

**సాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్**

గద్వాల, ఏప్రిల్ 13 : ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు గద్వాల గడ్డ నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలి వెళ్లాలని సాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం జోగుళాంబ గద్వాలలోని బీఆర్‌ఎస్ భవన్‌లో పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ వేడుకలను పండుగలా జరుపుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలు, వార్డుల్లో బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించి వాహనాల్లో బయలుదేరాలని పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

## రేవంత్‌ది దుర్మార్గ పాలన

- ఢిల్లీకి కప్పం కట్టుడే రేవంత్ లక్ష్యం
- 27వ తేదీ సభ కోసం యావత్తు దేశం ఎదురుచూస్తున్నది
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 13 : పదహారు నెలల క్రితం పాలనాపగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి దుర్మార్గ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభ ఏర్పాట్లను శనివారం ఆయన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. 27న నిర్వహించే భారీ బహిరంగ సభ కోసం యావత్తు దేశం ఎదురుచూస్తున్నదని తెలిపారు. సీఎంగా కేసీఆర్ పదేండ్ల కాలంలో హరితహారం కింద కోట్ల మొక్కలు నాటారని, చైనాలోని గోబి ఎడారిలో నాటిన మొక్కల తర్వాత అత్యధికంగా హరితహారం కింద మొక్కలు నాటిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. కానీ, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాతోపాటు హెచ్‌సీయూలో చెట్లను తొలగిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో తాగు, సాగునీటికి కొరత లేదని, ఈ 16 నెలల్లో మళ్లీ అన్ని సమస్యలు మొదలైనట్టు చెప్పారు. అనేక రంగాల్లో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణను కేసీఆర్ బంగారు తునకలా తయారు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను నాశనం చేసిన కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి పాత సమస్యలను సృష్టిస్తున్నదని దుయ్యబట్టారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన బాధ్యత ప్రజల తరపున బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్నదని, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ సభ నాంది పలుకుతుందని తెలిపారు. హామీలను విస్మరించి ఢిల్లీకి కప్పం కడుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ఈ సభ చెంపపెట్టులా మారుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక ఈ సభ అవుతుందని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎల్కతుర్తి సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఇండ్లకు తాళాలు వేసి సభకు వచ్చి కేసీఆర్ ప్రసంగం వినేందుకు ఆసక్తి చూపుతున్నట్టు చెప్పారు.



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

## భూభారతిని 'విశ్వసనీయంగా' అప్పగించాలి

- భద్రతా సమస్యలు తలెత్తకుండా ఫైర్‌వాల్స్ ఏర్పాటుచేయాలి
- వెబ్‌సైట్ కనీసం 100 ఏండ్లు పనిచేయాలి
- రైతులకు సులభంగా అర్థమయ్యేలా ఉండాలి
- భూభారతిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎం 'విశ్వసనీయ సంస్థ' వ్యాఖ్యలపై అనుమానాలు
- ఎన్‌ఐసీకి కాకుండా మరో సంస్థకు భూభారతి కట్టబెడతారా..?

హైదరాబాద్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): భూభారతి పోర్టల్ నిర్వహణను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భూభారతి పోర్టల్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో భూభారతి పోర్టల్‌పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... సామాన్య రైతులకు కూడా



సులభంగా అర్థమయ్యేలా, అత్యాధునికంగా వెబ్‌సైట్ ఉండాలని సూచించారు. ఇది కనీసం 100 ఏండ్లపాటు పనిచేసేలా ఉండాలని, భద్రత కోసం ఫైర్ వాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే, భూభారతి పోర్టల్‌ను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై రెవెన్యూశాఖ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ధరణి పోర్టల్ నిర్వహణను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ) చూస్తున్నది. గతంలో ధరణి పోర్టల్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు అప్పగించి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే ప్రైవేట్ సంస్థను తొలగించి ఎన్‌ఐసీకి అప్పగించింది. ధరణి స్థానంలో వస్తున్న భూభారతి పోర్టల్‌ను మళ్లీ విశ్వసనీయ సంస్థకు అప్పగించాలనే సీఎం వ్యాఖ్యలు దేనికి నిదర్శనమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంటే కేంద్ర ప్రభుత్వ సంస్థ విశ్వసనీయతను సీఎం రేవంత్‌రెడ్డి శంకిస్తున్నారా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

## భూమి రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి...

జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. ఇక భూ రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తామని, ఇందుకోసం కొత్తగా 6 వేల మంది ప్రైవేటు సర్వేయర్లను నియమించి శిక్షణ ఇస్తామని చెప్పారు. సర్వేకు సంబంధించిన చార్జీలు రైతులే భరించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇక భూ సమస్యల పరిష్కార బాధ్యతను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు అప్పగిస్తామని, అవసరమైతే ట్రిబ్యునల్స్ కూడా ఏర్పాటుచేస్తామని తెలిపారు. భూ రికార్డులను పరిరక్షించడం, వాటిపై రిపోర్ట్ ఇచ్చే బాధ్యతను మాత్రమే గ్రామ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. రికార్డుల్లో మార్పులు చేర్పులపై వీరికి అధికారం ఉండబోదని స్పష్టంచేశారు. రికార్డులను రాయగలిగేవారినే జీపీవోలుగా నియమిస్తామని, ధరణిలో అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. మనుషులకు ఆధార్ మాదిరిగా భూమికి భూదార్‌ను తీసుకొస్తామన్నారు. భూభారతి అమల్లోకి వచ్చినందున తక్షణమే కొత్త పాస్ పుస్తకాల అవసరం ఉండదని చెప్పారు. ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలగకుండా భూభారతిని అమలుచేస్తామని స్పష్టంచేశారు.

### పైలట్ ప్రాజెక్ట్ మండలాలు ఇవే..

భూభారతి పోర్టల్‌ను సోమవారం శిల్పకళావేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనుండగా, తొలుత మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలుచేయనున్నారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్), రంగారెడ్డి జిల్లా కీసర, సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

## ఢిల్లీ ప్రభుత్వాన్ని నడుపుతున్నది సీఎం భర్త

- ఆప్ నేత, మాజీ సీఎం ఆతిశీ ఆరోపణ

న్యూఢిల్లీ: సీఎం రేఖా గుప్తా భర్త ఢిల్లీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు అని మాజీ సీఎం, ఆప్ నేత ఆతిశీ శనివారం ఆరోపించారు. రేఖ భర్త మనీశ్ గుప్తా ఎంసీడీ, డీజేబీ, పీడబ్ల్యూడీ, డీయూఎస్‌ఐబీ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు కనిపిస్తున్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఓ మహిళ ముఖ్యమంత్రి కావడం, ప్రభుత్వ పనులన్నిటినీ ఆమె భర్త నిర్వహించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చునన్నారు. 'ప్రభుత్వాన్ని ఎలా నడపాలో రేఖా గుప్తాకు తెలియదా? ఢిల్లీలో ప్రతి రోజూ చాలా సేపు విద్యుత్తు కోతలకు ఇదే కారణమా?' అని తన పోస్ట్‌లో ఆతిశీ నిలదీశారు.

# మరో 16వేల ఎకరాలకు టెండర్!

- రైతులు వ్యతిరేకిస్తున్నా భూములు లాక్కునే ప్రయత్నాలు
- ఎవరి ప్రయోజనాల కోసం ఫ్యూచర్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు?
- కాంగ్రెస్ సర్కారు, రేవంత్‌రెడ్డిపై సబితాఇంద్రారెడ్డి ఫైర్
- ఎల్కతుర్తి సభతో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపు



రంగారెడ్డి జిల్లా కందుకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

రంగారెడ్డి, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ)/కందుకూరు: కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఫ్యూచర్‌సిటీ ముసుగులో మరో 15వేల ఎకరాలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరిట 1,000 ఎకరాలను తీసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తున్నారని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి సబితాఇంద్రారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్యూచర్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. 330 ఫీట్ల వెడల్పుతో వేసిన రోడ్డుతో భూములు కోల్పోతున్న రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండదని తెలిపారు. తమ అనుకూల వ్యక్తుల ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేయిస్తున్నారని సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఒప్పించి, తగిన పరిహారం ఇచ్చి, ఫార్మాసిటీ కోసం భూమి సేకరించిందని తెలిపారు. అధికారంలోకి వస్తే యాచారం మండలం కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆ భూములను రైతులకు ఇవ్వకపోగా, బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని సబితాఇంద్రారెడ్డి నిప్పులు చెరిగారు.

### రంగారెడ్డి జిల్లాను లూటీ చేస్తున్నారు: జైపాల్‌యాదవ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను కూడా తమకు అనుకూలంగా మార్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. మొండిగౌరెల్లిలో పరిశ్రమల పేరుతో యాచారం, కందుకూరు మండలాల్లో ఫ్యూచర్‌సిటీ పేరుతో, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, ఆమనగల్లు, మహేశ్వరం మండలాల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరుతో రైతుల భూములను లాక్కుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు భూసేకరణ పేరుతో రంగారెడ్డి జిల్లాను లూటీచేసేందుకు ప్రయత్నిస్తున్నారని జైపాల్ యాదవ్ విమర్శించారు. జిల్లా ప్రజలకు, రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని ఫ్యూచర్‌సిటీతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రద్దు చేయాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథనాయక్, బీఆర్‌ఎస్ కందుకూరు మండల అధ్యక్షుడు జయందర్, కందుకూరు సింగిల్‌విండో చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

ఈ నెల 27న హనుమకొండ ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని సబితా ఇంద్రారెడ్డి ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని బీఆర్‌ఎస్ శ్రేణులంతా తమ ఇంటి పండుగగా ముందుకు వచ్చి, సభను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ బహిరంగసభ ద్వారా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరముందని తెలిపారు.

## టీచర్ల సంక్షేమమే లక్ష్యం: యూటీఎఫ్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : విద్యారంగం అభివృద్ధి, టీచర్ల సంక్షేమమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ 12న ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం దోమల్‌గూడలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో యూటీఎఫ్ ముందుకెళ్తున్నదని రవి పేర్కొన్నారు.

## త్వరలో ఈఆర్సీకి ఇద్దరు కొత్త సభ్యులు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి ఇద్దరు కొత్త సభ్యులను సర్కారు నియమించనున్నది. టెక్నికల్ మెంబర్, ఫైనాన్స్ మెంబర్ పోస్టులను భర్తీచేయనున్నది. ఇద్దరు సభ్యుల్లో ఒకరు బీసీ అని, మరొకరు పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలుస్తున్నది. పోస్టుల భర్తీకి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించింది. ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున కొనసాగుతున్నారు.



# ఉపాధికి కోత

మొదటిపేజీ తరువాయి...

ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించడమే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ లక్ష్యం. కానీ, వివిధ నిబంధనలతో కొత్త పనులు పెరుగకపోవడంతో ఏటేటా కూలి తగ్గుతున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌ఆర్‌ఈజీఏ సాఫ్ట్-ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌తో లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంతో కూలీలు ఉదయం, సాయంత్రం పనులకు తప్పనిసరిగా హాజరుకావాలని షరతులు విధించింది. కూలీల పనులకు సంబంధించి ఉదయం 11 గంటల్లోపు ఒక ఫొటో, మధ్యాహ్నం 2 గంటల తర్వాత రెండో ఫొటో తప్పనిసరిగా తీయడంతోపాటు అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక గ్రామంలో ఉపాధి పని పూర్తయిన తర్వాతే మరో పని చేపట్టాలనే నిబంధన విధించారు. తద్వారా పనులు ఆలస్యమవుతున్నాయి. మెటీరియల్ కాంపోనెంట్ నిధుల్లోనూ కేంద్రం కోత విధించడం గమనార్హం.

### తెలంగాణలో ఉపాధి కూలీల వివరాలు

మొత్తం కూలీల సంఖ్య : 110.77 లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య : 54.85 లక్షలు
మొత్తం జాబ్ కార్డులు : 53.08 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు : 32.57 లక్షలు

### దేశవ్యాప్తంగా వివరాలు

మొత్తం జాబ్ కార్డులు : 15.03 కోట్లు
యాక్టివ్ జాబ్‌కార్డులు : 8.18 కోట్లు
మొత్తం కూలీల సంఖ్య: 25.92 కోట్లు
యాక్టివ్ కూలీల సంఖ్య: 11.66 కోట్లు

### గడిచిన ఐదేండ్లలో తెలంగాణ

ప్రభుత్వం ఉపాధి కూలీలకు చెల్లించిన మొత్తాలు

| | |
|---|---|
| 2021-22 | రూ.2,419.84 కోట్లు |
| 2022-23 | రూ.2,032.51 కోట్లు |
| 2023-24 | రూ.2,176.20 కోట్లు |
| 2024-25 | రూ.2,614.31 కోట్లు |
| 2025-26 | రూ.125.01 కోట్లు(నేటి వరకు) |

### గడిచిన ఆరేండ్లలో కేంద్ర సర్కారు

ఉపాధి కూలీలకు చెల్లించిన మొత్తాలు

| | |
|---|---|
| 2020-21 | రూ.78,016.86 కోట్లు |
| 2021-22 | రూ.75,091.63 కోట్లు |
| 2022-23 | రూ. 65,266.08 కోట్లు |
| 2023-24 | రూ.74,050.12 కోట్లు |
| 2024-25 | రూ.73,479.36 కోట్లు |
| 2025-26 | రూ. 1,132.34 కోట్లు(నేటివరకు) |

## కొత్త పంచాయతీలొచ్చాకే ఎన్నికలు?

- 242 కొత్త జీపీల ఏర్పాటుకు కసరత్తు
- ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ
- మంత్రులు, ఎమ్మెల్యేల వినతులు
- జనాభా, దూరం ఆధారంగా జీపీల ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ ఓకే!

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా మరో 242 పంచాయతీలు ఏర్పాటు కానున్నాయా? కొత్త పంచాయతీల జాబితా ప్రకటించి, పాతవాటితోపాటే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉన్నదా? అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. 'ప్రభుత్వం తలచుకుంటే కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటును ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టవచ్చు. ఆమోదింపజేయవచ్చు కూడా. ఆ బిల్లును గవర్నర్ ఆమోదం తెలిపితే, కొత్త పంచాయతీల ఏర్పాటుపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఎంత పని?' అని అధికార వర్గాలు అంటున్నాయి. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారు. వాటిని నెరవేర్చే దిశగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణ ఏర్పాటైనప్పుడు రాష్ట్రంలో మొత్తం 8,685 గ్రామ పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, మండలాలు, కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా 2019 ఎన్నికల నాటికి గ్రామ పంచాయతీల సంఖ్య 12,751కు చేరింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తండాలను పంచాయతీలుగా చేయడంతో కొత్తగా మరో 223 జీపీలు పెరిగాయి. ఇప్పుడు అధికారిక లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 12,848 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

### వెల్లువెత్తిన వినతులు

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనేక జిల్లాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. కనీసం 350 మంది జనాభా ఉండాలనే నిబంధనను మార్చయినా, తాము ప్రతిపాదించే అన్ని గ్రామపంచాయతీలకు ఆమోదం తెలిపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. గ్రామ జనాభా, దూరంతో పాటు ఇతర నిబంధనలను పరిగణనలోకి తీసుకొని గ్రామ పంచాయతీల ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ సూత్రపాయంగా అంగీకారం తెలిపినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి.